95 శాతం కులగణన పూర్తి

- సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపిన మేయర్ గంగాడ సుజాత
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో నగరంలోని పలు అభివృద్ధి పనులపై సమీక్ష


వెంగముక్కలపాలెం సచివాలయంలో సమీక్షిస్తున్న మేయర్ గంగాడ సుజాత


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని 18వ డివిజన్ వెంగముక్కలపాలెం వార్డు సచివాలయం పరిధిలో కులగణనను 95 శాతం పూర్తి చేసినందుకు సచివాలయ సిబ్బందిని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అభినందించారు. గురువారం వెంగముక్కలపాలెం వార్డు సచివాలయంలో సిబ్బందితో మేయర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి సమస్య అయినా పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశం...

ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని గురువారం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. పనులు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇకపై నగరంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చించారు. సమావేశంలో కమిషనర్ ఎం.జస్వంతరావు, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, కండే స్వాతి, నూకతోటి మస్తానమ్మ, వెన్నపూస కుమారి, షేక్ ఫాతిమాబీ, ఇతర ఇంజినీరింగ్, పారిశుధ్య, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు ఖ్యాతి తెచ్చిన ఘనులు.. కళాకారులు...

జిల్లాకు పౌరాణిక కళాకారులు ఖ్యాతి తెచ్చారని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. ఈ నెల 10వ తేదీ నగరంలోని నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లో గల మున్సిపల్ ఆడిటోరియంలో సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం పోస్టర్‌ను కళాకారులతో కలిసి మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిల్లాకు ఖ్యాతి తెచ్చిన కళాకారుల్లో బండారు రామారావు, డి.వి.సుబ్బారావు, చీమకుర్తి నాగేశ్వరరావు, అద్దంకి మాణిక్యాలరావు, మార్తాటి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అల్లూరు శాంతారావు, ఎం.జయరావు, కే వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, ఉలిచి బాబూరావు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

10న హరిశ్చంద్ర ఏక పాత్రాభినయం ప్రదర్శన

ఒంగోలు టౌన్: ఈ నెల 10వ తేదీ ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో హరిశ్చంద్ర కాటిసీను ఏకపాత్రాభినయం ప్రదర్శించనున్నట్లు జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా రెండో శనివారం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వద్దిమడుగుకు చెందిన దడిగే రామయ్య ప్రదర్శన చేయనున్నట్లు చెప్పారు. అలాగే, దొంగను ముంచిన దొంగ అనే హాస్య నాటికను కూడా ప్రదర్శించనున్నారని తెలిపారు. ఇందులో పాత్రలన్నీ కేవలం మహిళలే నటించడం జరుగుతుందని వివరించారు. ఒంగోలు నగర, పరిసర ప్రాంత ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక దాడులు

చీమకుర్తి: విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం సంతనూతలపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. 2,383 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. అదనపు లోడు వాడుతున్న 197 సర్వీసుల యజమానులకు రూ.63,200 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. 4 సర్వీసులపై విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసి రూ.33 వేలు పెనాల్టీ విధించారు. 4 సర్వీసులపై మాల్ ప్రాక్టీస్ కింద రూ.6 వేలు పెనాల్టీ విధించారు. మండలం మొత్తం మీద 205 కేసులు నమోదు చేసి రూ.6.02 లక్షల అపరాధ రుసుం వసూలుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఒంగోలు ఈఈ పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు ఏపీసీపీడీసీఎల్‌కు చెందిన అధికారులు, వారి సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలుగా నిలవండి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: చెస్ అకాడమీ వారు నిర్వహించే చెస్ పోటీలలో విజేతలుగా నిలవాలని స్థానిక క్రీడాకారులకు వైఎస్సార్ సీపీ అద్దంకి పరిశీలకుడు మారం వెంకారెడ్డి పిలుపునిచ్చారు. ఏపీ చెస్ అకాడమీ-ఒంగోలు వారు చీమకుర్తిలోని లిటిల్ స్టార్ హైస్కూలులో నిర్వహించే జిల్లా స్థాయి చెస్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను వెంకారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ఉపాధ్యాయులు శ్రద్ధ కనబరచాలని డీఈవో డి.సుభద్ర సూచించారు. గురువారం స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూలులో జరుగుతున్న సహిత విద్య రిసోర్సు పర్సన్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ విద్యను పెంపొందించడంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, రిసోర్సు పర్సన్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఒక రోజు ట్యాబుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యనందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్లు, రిసోర్సు పర్సన్లు, ఏడీ సురేఖావాణి, ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రికి ప్రత్యేక అభిషేకాలు


కాశీనాథునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఒంగోలు మెట్రో: ప్రతి మాసంలో అమావాస్య ముందు వచ్చే చతుర్దశిని మాస శివరాత్రిగా భక్తులు జరుపుకుంటారు. గురువారం స్థానిక కేశవస్వామిపేటలోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో వెలసిన మరకత శివలింగానికి, అంజయ్య రోడ్డులోని పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో, సంతపేట సాయిబాబా మందిరంలో కాశీవిశ్వేశ్వరునికి, రంగారాయుడు చెరువు దగ్గరున్న అరుణాచలేశ్వర స్వామికి, మంగమూరు రోడ్డులోని గాంధీనగర్ మూడో లైన్లో సీతా రామలింగేశ్వరస్వామి ఆలయంలో, పేర్నమిట్ట ఎడ్లూరు డొంకలో కాశీ విశ్వనాథుని ఆలయంలో అర్చకస్వామి రాము శర్మ ప్రదోషకాలంలో నమ్మక చమకాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలతో చక్కగా పుష్పాలంకరణ చేసి కాశీనాథునికి మంగళ హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వచనం తీసుకున్నారు.

కరవది పీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు


చేజర్ల రోడ్డు నుంచి పీహెచ్‌సీ వరకు చదును చేస్తున్న రోడ్డు


కరవది పీహెచ్‌సీ

ఒంగోలు రూరల్: కరవది పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు. చేజర్ల రోడ్డులో నుంచి పీహెచ్‌సీ వరకు పటిష్టమైన వరద దాటిని సైతం తట్టుకునే విధంగా మెటల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా రోడ్డు వేసే ప్రాంతాన్ని డోజర్, జేసీబీ సహాయంతో గురువారం చదును చేశారు. రెండు రోజుల క్రితం ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సర్పంచ్ డి.కోటేశ్వరరావు, కార్యదర్శులు శ్రీనివాస్, వేమా శ్రీలక్ష్మి, వీఆర్‌వోలు పీహెచ్‌సీని సందర్శించారు. కరవది బ్యాంకు బజారు నుంచి పీహెచ్‌సీలోకి వెళ్లేందుకు మార్గం లేకపోవడం, ప్రస్తుతం ఉన్న మార్గం ప్రైవేటు వ్యక్తులది కావడంతో చేజర్ల మార్గంలో నుంచి సబ్ స్టేషన్ మీదుగా పీహెచ్‌సీ ముఖ ద్వారం వరకు రోడ్డు నిర్మాణం పూర్తిచేయనున్నట్లు కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఇదే సమయంలో పూర్తి రక్షణతో కూడిన ఎత్తయిన ప్రహరీ నిర్మాణంతో పాటు వాహనం లోనికి వెళ్లేందుకు, వరద ప్రభావం తప్పించుకునేందుకు మూడు అడుగుల మట్టితో, రెండు అడుగుల డస్టుతో ఎత్తు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పనులు వచ్చే సోమవారం నుంచి ప్రారంభమవుతాయని వారు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన కలెక్టరేట్ ఏఓ


కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్ కేదార్‌నాథ్‌ను అభినందిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు


కొత్తపట్నం నూతన తహసీల్దార్ హేమంత్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీటీ అర్జున్‌రెడ్డి

ఒంగోలు అర్బన్: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా శ్రీకాంత్ కేదార్‌నాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ఏఓగా పనిచేసిన చిరంజీవి నెల్లూరు జిల్లాకు బదిలీ కాగా, గుంటూరు జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ ఒంగోలు వచ్చారు. ఆయనను కలెక్టరేట్ ఏఓగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, కలెక్టరేట్ అధ్యక్షుడు వూతకోలు శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటేశ్వరరాజు, ఇతర సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రశాంత్, ఆదిత్య, సుజన్ తదితరులు కలిసి అభినందలు తెలిపారు.

కొత్తపట్నం తహసీల్దార్‌గా హేమంత్ కుమార్...

కొత్తపట్నం: మండల నూతన తహసీల్దార్‌గా పసులేటి హేమంత్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఏఎస్‌వో కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని, కొత్త ఓట్లు నమోదు చేయాలని, పేర్లు సరి చేయడం, ఆధార్ సీడింగ్ చేయాలని సూచించారు. ఫారం 6, 7, 8, 8ఏ గురించి వివరించారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధాల దుష్ప్రభావాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న రిమ్స్ ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ చంద్రకళ

మద్దిపాడు: వ్యాధులకు ఉపయోగించే ఔషధాలు దుష్ప్రభావాలు చూపితే వినియోగదారులు తీసుకోవాల్సిన చర్యల గురించి రిమ్స్ ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ చంద్రకళ మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. గురువారం మద్దిపాడు పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ పాల్గొని ప్రసంగించారు. భారత ఔషధ ప్రబంధ కమిషన్ జాతీయ సమన్వయ కేంద్రం-భారత ఔషధ సహ నిఘా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఔషధాలు దుష్ప్రభావాలు చూపితే వాటిని నియంత్రించేందుకు కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఇంజక్షన్లు, మాత్రలు, క్యాప్సుల్స్, వ్యాక్సిన్ ఏవైనా సైడ్ ఎఫెక్ట్స్ చూపితే ఆ మందులు వాడిన వారుగానీ, ఇచ్చిన వారుగానీ నిర్దేశిత ఫార్మేట్‌లో అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ సెంటర్‌ రిమ్స్, ఒంగోలు వారికి తెలిపినా.. లేకుంటే ఏడీఆర్ పీవీపీఐ (ఫార్మకాలజీ విజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా) యాప్‌లో అప్‌లోడు చేసినా సదరు ఔషధాన్ని పరిశీలించి వెంటనే దాని దుష్ప్రభావాన్ని పరీక్షించి దానిని నిషేధించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఔషధాలు, వాటి దుష్ప్రభావాల గురించి ఆమె వీడియో ద్వారా చూపుతూ వైద్యశాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలలో కూడా అవగాహన పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లను కోరారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఝాన్సీవాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ తులసీ గోకుల్, డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ సుప్రియ, ఫార్మకాలజీ పీజీ డాక్టర్లు చంద్రశేఖరబాబు, ప్రసన్న, అబ్రార్, లోకేష్, ముత్తుకుమార్, షబ్నం, జహీర, రమ్య, అబూబకర్, సురభి, శివరామకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్లు శ్రావణ్, జగదీష్, పీహెచ్‌సీ వైద్యశాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌కు సన్మానం...

నేలటూరు ఆశావర్కర్ వడేల వరమ్మ జనవరి 31వ తేదీ పదవీ విరమణ చేయడంతో ఆమెను ఆశా డే సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు ఆస్పత్రి డాక్టర్లు సన్మానించి వీడ్కోలు పలికారు.

రూ.60 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి పరిశీలన


బ్రిడ్జిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

చీమకుర్తి: చీమకుర్తి బైపాస్‌లో సాగర్ కాలువపై శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జిని జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు గురువారం పరిశీలించారు. చీమకుర్తి నుంచి బైపాస్ మీదుగా సాగర్ కాలువపై ఉన్న బ్రిడ్జి నుంచి కూనంనేనివారిపాలెం మీదుగా కొండపి వరకు ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగించనున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేసిన నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణ సమయంలో వంతెన మీదుగా రాకపోకలకు ఆటకం లేకుండా ఏర్పాట్లు చేసి నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులకు జెడ్పీటీసీతో పాటు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు సూచించారు.

12న ఒంగోలు మండల సర్వసభ్య సమావేశం

ఒంగోలు రూరల్: ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 12వ తేదీ ఒంగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మీడియాకు తెలిపారు. మండలంలోని 36 శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు. హాజరుకాని వారిపై ఉన్నతాధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు పాల్గొననున్న ఈ సమావేశానికి ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహిస్తారని, ఎంపీడీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

శిద్దా వెంకట సుబ్బారావుకు ఘన నివాళులు


సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సోదరుడైన వాసవీ గ్రానైట్ ఎండీ శిద్దా వెంకట సుబ్బారావుకు శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల వయోభారంతో శిద్దా వెంకట సుబ్బారావు మృతి చెందడంతో వారి కుమారులు శిద్దా హనుమంతరావు, శిద్దా సుధాకర్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని వారి నివాసం వద్ద వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా వెంకట సుబ్బారావు కుటుంబంతో వారి కుటుంబ సభ్యులకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, టీటీడీ పాలకవర్గం సభ్యులు శిద్దా సుధీర్ కుమార్, శిద్దా కుటుంబ సభ్యులు, పలువురు గ్రానైట్ యజమానులు, మేనేజర్‌లు నివాళులర్పించి సుబ్బారావు కుమారులు హనుమంతురావు, సుధాకర్‌ను పరామర్శించారు.

గ్రంథాలయంలో సభ్యత్వం కలిగి ఉండాలి


విద్యార్థులతో దాతలు, గ్రంథాలయ సిబ్బంది

ఒంగోలు టౌన్: చేతిలో సెల్‌ఫోన్ ఉండటం కంటే గ్రంథాలయంలో సభ్యత్వం కలిగి ఉండటమే ఉత్తమమని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముప్పాళ్ల రాంబాబు, కేఎస్ శ్రీనివాసులు, డీవీ సుబ్బారావు, వి.బ్రహ్మనాయుడు, జాలాది మోహన్, నున్నా ఆంజనేయులు తదితరుల ఆర్థిక సహాయంతో నగరంలోని పీవీఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థినులకు గ్రంథాలయ సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని, ఏమాత్రం ఖాళీ దొరికినా గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వం తీసుకోవడం వలన మనకు కావాల్సిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లు విలువైన సమయాన్ని వృథా చేస్తాయని, భవిష్యత్తులో ఎదగకుండా నష్టం కలగజేస్తాయని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న అన్నారు. పుస్తకాలు చదవడం వలన భాషా పరిజ్ఞానం పెరుగుతుందని, మెదడు చురుగ్గా పనిచేస్తుందని చెప్పారు. పుస్తకాలు చదివే అలవాటు ఉన్న పిల్లలు జీవితంలో విజయం సాధిస్తారని, ఏదైనా ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారని అన్నారు. గ్రంథాలయంలో కూర్చుని చదవడం ద్వారా ప్రపంచంలోని సంస్కృతులు, వివిధ దేశాల ప్రజల జీవన విధానాలను తెలుసుకోవచ్చని ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి చెప్పారు. సభ్యత్వం కోసం ఆర్థికసాయం చేసిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, అనిల్‌బాబు, స్కైలీ, పి.పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీ సమస్యలు తెలుసుకున్న ఎస్‌డీసీ


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌డీసీ ఝాన్సీలక్ష్మి

మద్దిపాడు: మద్దిపాడు సమీపంలోని ఘడియపూడి పునరావాస కాలనీని ఎస్‌డీసీ ఝాన్సీలక్ష్మి గురువారం మధ్యాహ్నం సందర్శించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు పలు సమస్యలను ఆమెకు తెలిపారు. ముఖ్యంగా శ్మశాన సమస్య ఉందని, గుండ్లకమ్మ రిజర్వాయర్ కుడి కాలువ పక్కనే ఉన్న స్థలంలో ప్రస్తుతం ఖననం చేస్తున్నామని చెప్పారు. తమ సమస్యను గత 10 సంవత్సరాలుగా ఉన్నతాధికారులకు తెలియపరుస్తూనే ఉన్నామని తెలిపారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఎస్‌డీసీని కోరారు. కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని, కాలనీలో కల్వర్టులు కట్టే సమయంలో దిగువన కట్టారని, ఆ తర్వాత కాలనీలో సీసీ రోడ్లు వేసే క్రమంలో కల్వర్టులు ఎక్కువ ఎత్తులో కట్టడం వలన డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిందని తెలిపారు. దీంతో కాలనీ వాసులు డ్రైనేజీలను చెత్తతో నింపడం వలన పాత డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పనిచేయడంలేదని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ఎస్‌డీసీని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో కోనేరు రంగారావు కమిటీ డీటీ వెంకట సునీల్, డీఈ షేక్ కరీముల్లా, ఏఈఈ షేక్ హబీబ్, బి.ఇమాన్యుయేల్, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బీజేపీ నాయకుడు, కార్యకర్త ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించి గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జోనల్ ఇన్‌చార్జి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం దర్శి, కొండపి, ఒంగోలు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి, పార్లమెంటు కన్వీనర్ శ్రీనివాసరావు, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ పూర్వ రీజియన్ చైర్మన్ తుమ్మపూడి బుచ్చిబాబు భార్య తుమ్మపూడి శేషుకుమారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డులో ఉషోదయ వృద్ధాశ్రమ మాతృ మూర్తులకు గురువారం నిత్యావసరాలు అందించారు. ఆశ్రమ నిర్వహణకు కొంత ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కూనల శ్రీనివాసరావు మాట్లాడుతూ వాసవీ క్లబ్స్ ద్వారా విలువైన కార్యక్రమాలను సంవత్సరం పొడవునా వివిధ సందర్భాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాత తుమ్మపూడి బుచ్చిబాబు మాట్లాడుతూ వాసవీ సంస్థలు సామాజిక సేవా రంగంలో అగ్రగామిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా అధికారులైన రీజియన్ చైర్మన్ రంగస్వామి, సెక్రటరీ ఎ.సత్యం, జోన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు, చలువాది సత్యనారాయణ, చలువాది బాలసుబ్రహ్మణ్యం, గాధంశెట్టి సాయి సతీష్, చీదెళ్ల వెంకట ప్రసాదు, అరవిందలక్ష్మి, కవితరాణి, దుర్గా భవాని, సౌందర్య క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు నిత్యావసరాల పంపిణీ

అల్లూరు (కొత్తపట్నం): ఆకలితో అలమటిస్తున్న నిరుపేద మహిళకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అల్లూరు గ్రామం ఆర్‌ఆర్‌కాలనీలో నివాసం ఉంటున్న మాణిక్యాల మస్తానమ్మ కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి. పిల్లలు పట్టించుకోక ఇంటి దగ్గరే పస్తులుంటోంది. ఈ విషయాన్ని మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. వారు స్పందించి మిట్నసల అశోక్‌కుమార్ ఆర్థికసాయంతో మస్తానమ్మ కుటుంబానికి బియ్యం, చింతపండు, నూనె వంటి నిత్యావసరాలు పంపిణీ చేశారు. కష్టకాలంలో సరుకులు ఇవ్వడంతో ఆమె ఎంతో ఆనందించి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న మోహన్‌రావు

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరు హైస్కూల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడే సామగ్రిని అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. అల్లూరు గ్రామానికి చెందిన మిట్నసల మోహన్‌రావు సొంత నిధులతో ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు వంటివాటిని 50 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు కష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. మండలంలో ఏడు హైస్కూళ్లు ఉంటే గతేడాది అల్లూరు పాఠశాల విద్యార్థి 580 మార్కులతో మొదటి ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. ఈసారి కూడా నూరు శాతం ఉత్తీర్ణులై మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సుబ్బారావు, మండల అంబేడ్కర్ ఇండియా మిషన్ కన్వీనర్ ఈసా ప్రశాంత్, ఏఐఎం టీమ్ సభ్యులు బి.వేణు, జె.సుమన్, కె.రమేష్, ఎం.రాజేష్, ఎం.షాలేము, ఎం.యోహోషువ, కె.నరేష్ పాల్గొన్నారు.